## వీరనారీమణులు

# విమలదేవి

భారతదేశాన్ని ఔరంగజేబు పరిపాలించే కాలంలో మార్వాడలోని రూప నగరానికి అమరసింగు రాజుగా ఉండేవాడు. అతడికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురి పేరు కేనరిబాయి, చిన్న కూతురి పేరు విమలదేవి. వాళ్ళిద్దరూ అందంలో ఒకరికొకరు ఏ మాత్రం తీసిపోరు.

ఆ కాలంలో రాజపుత్ర రాజులు కొందరు ఔరంగజేబుకు జడిసి, అతని ఆజ్ఞ ప్రకారం తమ ఆడపిల్లలలో ఒకరిద్దరిని అతనికిచ్చి వివాహం చేస్తూండేవారు. ఆ కోవకు చెందినవాడే ఈ అమరసింగు కూడా! తన పెద్ద కూతురు కేనరిబాయిని ఔరంగజేబుకిచ్చి వివాహం జరిపించాడు. ఆమె కూడా అతని ఐశ్వర్యం చూసి ఆ పెళ్ళికి అంగీకరించింది.

కాని విమలదేవికి ఇది నచ్చలేదు. పెళ్లయిన రోజు నుంచి తన అక్కను, తండ్రిని గౌరవించడం మానేసింది. తాను తన అక్కలాగా కాకుండా ఒకసాటి రాజపుత్రుని వివాహం చేసుకుంటానని ప్రతిజ్ఞ తీసుకుంది. పెళ్లి అయిన తర్వాత ఒకసారి కేనరిబాయి తమ రాజ మందిరానికి వస్తే ఆమెను చూడనైనా చూడలేదు.

రారాజైన ఔరంగజేబు భార్యనన్న అహం కేనరిబాయిలో తాండవించింది. ఆమెతో విమలదేవి మాట్లాడక పోవటం అవమానంగా భావించి ఢిల్లీకి వెళ్ళి ఔరంగజేబుతో తన చెల్లెలి అందం గురించి చెప్పింది. ఆమె మహమ్మదీయులను చేసుకోనని శపథం చేసిందని, స్వజాతి రాజపుత్ర వీరుణ్నే చేసుకుంటుందనీ చెప్పి అతణ్ణి రెచ్చ గొట్టింది.

అది విన్న ఔరంగజేబు విమలదేవిని తనకిచ్చి వివాహం చెయ్యమని అమరసింగుకు జాబు రాస్తాడు. అమరసింహుడు సంతోషంతో పెళ్ళికి అంగీకరిస్తాడు. కానీ విమలదేవి దీనికి ససేమిరా ఒప్పుకోదు.

ఆ కాలంలోనే సిసోదియా రాజకులంలో రాజసింహుడనే గొప్పవీరుడు హిందువులకు అండదండగా ఉండేవాడు. అతని పరాక్రమం బీరం నది వరకు ప్రాకి ఉండటంవల్ల, విమలదేవి అతనికి తన పరిస్థితిని వివరించి ఒక జాబు రాసి పంపుతుంది. అందులో ఆమె తనను రాజహంసతోనూ, ఔరంగజేబును కాకితోనూ పోలుస్తుంది. రుక్మిణిని శ్రీకృష్ణుడు తీసుకొని వెళ్ళి వివాహం ఆడినట్లు తనను తీసుకొని వెళ్ళి వివాహమాడమని బ్రతిమాలుతూ రాస్తుంది.

ఆ ఉత్తరాన్ని చదివిన రాజసింహుడు ఆమె ధైర్యానికి ఎంతో ముగ్ధుడవుతాడు. వెంటనే అతడు ఆమెను పెళ్ళాడటానికి పెద్ద సైన్యంతో రూప నగరానికి బయలుదేరతాడు.

అటు ఔరంగజేబు తన సకల పరివారంతో పెళ్ళికి తయారయి విలాసంగా వస్తూ వుంటాడు. ఇటు రాజసింహుడు తన పరివారంతో అదే విమలదేవిని వివాహమాడడానికి వస్తూంటాడు.

ఔరంగజేబు పరివారం కోసం ఎదురు చూస్తున్న అమరసింగు, రాజసింహుని పరివారం చూసి ఆశ్చర్య పోతాడు. ఔరంగజేబు కన్న ముందుగా రూప నగరంలో ప్రవేశించి, విమలదేవిని తనతో నగరానికి తీసుకొని బయలుదేరుతాడు రాజసింహుడు. తన కళ్ళముందే తన కూతురితో వెళ్ళిపోతున్న రాజసింహుణ్ణి చూసి, అమరసింగు దిగ్భ్రాంతి చెందుతాడు.

విమలదేవి, రాజసింహుడు అక్కడి కొండ కనుమల మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. అక్కడ రాత్రి విశ్రమించడానికి డేరాలు వేస్తారు. అర్ధరాత్రి వేళలో "నన్నెవరయినా కాపాడండి, కాపాడండి" అనే ఒక స్త్రీ ఆర్తనాదం వినిపిస్తుంది విమలదేవికి. ప్రయాణపు బడలికలో విమలదేవి రాజసింహుల పరివారం అంతా నిద్రపోతూ ఉంటారు. అయినా ఆమె ఆ అర్ధరాత్రిలో అరుపులు వినిపించిన వైపు ఒంటరిగా వెళుతుంది. ఆ స్త్రీ ఎవరో కాదు, తన సోదరి కేనరిబాయి! ఔరంగజేబు పరివారంలోని కొందరు చెంచులు—తాగిన మైకంలో ఆమెను ఎలాగో ఎత్తుకొచ్చి ఈ కొండ ప్రాంతంలోకి తీసుకు వస్తారు.

సోదరిపైన తనకు గౌరవం లేకపోయినా, ఆమె ఔరంగజేబును వివాహం ఆడి తన జీవితాన్ని పాడు చేయాలని ప్రయత్నించినా ఆమెను క్షమించి ఒకసాటి స్త్రీకి సాయం చేస్తున్నానని తన మనసును సమాధానపరచుకొని, ఆ చెంచులపై బడి, వారి నుండి తన సోదరిని కాపాడి తన గుడారానికి తీసుకు వెళ్తుంది విమలదేవి.

విమలదేవి సంస్కారానికి ఎంతో ఆశ్చర్యపోయిన కేనరిబాయి తన తప్పుకు ఎంతో కుమిలిపోతూ, సిగ్గుతో తల వంచుకొని తనను క్షమించమని కోరుతుంది. విమలదేవి తన సోదరిని స్వయంగా తీసుకొని ఔరంగజేబు వద్దకు వెళ్ళి ఆమెను అతనికి వప్పజెప్పి, తాను రాజసింహుని వివాహమాడబోతున్న విషయాన్ని అతనికి తెలియజేస్తుంది.

కేనరిబాయి చెప్పిన వృత్తాంతం విని ఔరంగజేబు, విమలదేవి ధైర్యాన్ని పరాక్రమాన్ని తెగువని ఎంతో ప్రశంసించి తన భార్యతో తిరిగి ఢిల్లీ వెళ్ళిపోతాడు.

విమలదేవి రాజసింహునితో ఉదేపూరుకు వెళ్ళి అతణ్ణి వివాహం చేసుకుంటుంది!

—సి. హెచ్. ఇంద్రాణి

## చిట్టి కథ

# మాయ

స్నానంచేసి చీర చుట్టబెట్టుకొని పరుగు లాంటి నడకతో బాత్రూం నుంచి తన గదిలోకి వచ్చింది జయ. అద్దం ముందు నిలబడి అన్ని కోణాల్లోనూ అందం చూసుకొంటూ, మురిసిపోతూ చీరకట్టుకుంది. కళ్ళకు కాటుక దిద్దుకుంటున్నప్పుడు అద్దంలో బోసిచెవులు కనిపించాయి.

వజ్రాలదుద్దులు లేవు!

స్నానం చేస్తున్నప్పుడు వాటిని చెవుల్లోంచి తీసి, కుంకుడువులుసుతో రుద్ది అక్కడే మరిచిపోయింది.

గబగబా బాత్రూంలోకి వెళ్ళిన జయ గుండె ఝల్లుమంది. ఒక క్షణంక్రితం అక్కడుంచిన దుద్దులు యిప్పుడు లేవు! కంగారుగా, నీళ్ళతొట్టి, కాలువ, బకెట్—ఆ గదిలో ప్రతి అంగుళమూ వెదికింది... ఊహూ... దుద్దులు కనిపించలేదు.

భర్త సూర్యంకి చెప్పింది దిగులుగా. అతనూ వెదికాడు కాని అవి కనిపించలేదు.

కాంపౌండ్‌వాల్ పొడవునా వున్న ఆ కాలువ చివరకు మునిసిపాలిటీ డ్రెయిన్‌లో కలుస్తుంది. ఆ కాలువ నిండా చెత్తాచెదారం ఉంది. దానిలో పడినవస్తువు దొర్లుకుంటూ మునిసిపల్ డ్రెయిన్‌లోకి పోయే అవకాశంలేదు. ఆ కాలువ అంతా పుల్లముక్కలతో కెలుకుతూ వెదికాడు సూర్యం. ఊహు... అవి కనిపించలేదు. పిల్లలు కూడా తమవంతు పరిశోధన ప్రారంభించారు. అబ్బే! వాళ్ళకీ కనిపించలేదు!

అందరి ముఖాలూ మాడిపోయాయి. దిగులు. బాధ. జయకయితే ఏడుపు వచ్చేస్తోంది.

దుద్దులు లాంటి బరువైన వస్తువులు కాలువలో పడిన ఎంతోదూరం కొట్టుకొనిపోవు. కాలువ అంతా వెదికినా అవి దొరకలేదంటే ఎవరో దొంగిలించి ఉంటారు. ఎవరై ఉంటారు?

జయ స్నానం చేసాక బాత్రూం లోనికి పనిమనిషి వెళ్ళింది. ఇంటికి వెళ్ళేటప్పుడు అది "అమ్మా వెళ్తున్నాను" అని చెప్పి మరీ వెళ్ళేది. ఈ రోజు చెప్పకుండానే వెళ్లి పోయింది.

అంతే.... ఇది దానిపనే అయ్యుంటుంది.

"పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి రిపోర్టు చేయండి" అంది జయ.


ఇంకా కాలువ వద్దనే వెదుకుతున్న మాధవ్‌కి "పోలీస్" అన్నమాట వినిపించింది. "అమ్మా! దొరి కాయి! దుద్దులు దొరికాయి" అని అరిచాడు.

అందరూ అక్కడికి పరుగున వచ్చారు.

బాత్‌రూం గోడకి వున్న రంధ్రమూ, కాలువా కలిసే చోట సిమ్మెంట్ పెచ్చులూడిపోయి గోతుల్లాగ ఏర్ప డ్డాయి. ఒక గోతిలో వున్నాయి ఆ దుద్దులు!

జయ ఆనందం వర్ణనాతీతం. "మన వాడు పెద్ద డిటెక్టివ్ అవుతాడండీ!" అంది సంబరంగా దుద్దులు అందుకుంటూ.

'నేనంటే ఏమనుకున్నావ్!' అన్నట్లు సగర్వంగా




చూసాడు మాధవ్.

భర్త జేబులో చెయ్యిపెట్టి పదిరూపాయల నోటు తీసి కొడుక్కి బహుమతిగా యిచ్చింది జయ. అమ్మ అనుమతి తీసుకొని జేమ్స్‌బాండ్ సినిమా మార్నింగ్‌షోకి బయలు దేరాడు మాధవ్ సగర్వంగా నవ్వుకుంటూ.

ఆ యింటిలో వస్తువులు తరచుగా పోతూనే ఉంటాయి. అవి తప్పని సరిగా మాధవ్‌కే దొరుకుతాయి! బహుమతి కూడా మాధవ్‌కే! అదంతా మాధవుడి మాయ!

(ఏదైనా మంచిపని చేస్తే పిల్లలకు డబ్బులిస్తూ ఉంటారు తల్లిదండ్రులు. కాని అది అంతమంచి పద్ధతి కాదేమో అని చెప్పడానికే ఈ చిట్టి కథ)

—శుభ



# బామ్మగారి పేజీ

బామ్మగారూ, 'మృత్తికా స్నానమంటే ఏమిటి?' అనడుగుతున్నారర్రా విశాఖపట్నం నుంచి దేవకిగారు.

'మృత్తిక' అంటే మన్ను మట్టితో దేహరోగ నివారణ చేసుకోవడానికి ప్రయత్నించడాన్నే కొందరు మృత్తికా చికిత్స అంటారు. గాంధీజీ, ఈ ప్రక్రియనే ఉపయో గించేవారు. మనిషి శరీరంలో చేరి వుండే విషాన్ని హరించటానికి మృత్తిక, అదేనర్రా... మట్టి కంటె ప్రయో జనకరమైన పదార్థం మరొకటి లేదని మన పెద్దలు చెబుతారు. ఈ ప్రక్రియ మనదేశంలోనే కాకుండా విదేశాల్లోను పూర్వం ఉపయోగించేవారట.

అంతెందుకు నా చిన్నప్పుడు జర్మనీ దేశంలో, విషసర్పం కరవడం వల్ల 'మరణించిన' వ్యక్తి మృతదేహా న్ని భూమిలో కంఠం వరకు నిలువుగా పాతి పెట్టితే, రెండు మూడు గంటల కాలంలో ఆ కళేబరం సజీవమై నట్లు, గాంధీగారి 'ఆరోగ్య మార్గ' మనే గ్రంథంలో చదివాను. 'అయితే చనిపోయిన వాడు ఎలా బ్రతికా డు? బామ్మగారూ కట్టుకథలు చెప్పకండి' అని మీరు అన్నా అనవచ్చు.

పాము కరచిన వ్యక్తికి విషం దేహమంతటా వ్యా పించడం వల్ల మృత ప్రాయుడయి వుండవచ్చును. అయితే వైద్యులకు అంతుపట్టని విధంగా అతనిలో కొన్త జీవం వుండి వుండవచ్చును. మరికొద్ది క్షణాల్లో చనిపోతాడనుకున్న వ్యక్తిని మృత్తిక చికిత్స చేత బ్రతి కించారే కాని మరణించిన వ్యక్తిని కాదని నా అభిప్రాయం కూడా.

తేలు, పాము మొదలైన విష జంతువులు కరిచిన చోట మంచి ఒండ్రు మట్టి వేసి కట్టు కట్టితే, విషం దిగిపోతుందని గాంధీ మహాత్ముడు అన్నారు. ఆ విధంగానే శిరోభారం వున్నా, నెత్తురు గడ్డలు లేచినా, ఆయన ఒండ్రు మట్టి చికిత్సే శ్రేయస్కరం అన్నారు.

పొత్తి కడుపుపైన ఒండ్రు మట్టితో ఒక పట్టీలా వేస్తే జ్వరంతో పీడింపబడుతున్న వ్యక్తికి కాల విరేచనమయి జ్వరాన్ని తగ్గిస్తుంది. మలబద్ధకమే జ్వరానికి కారణం. చేయి, కాలు మొదలైనవి బెణికినా, చాకు వంటి వాటివల్ల తెగి గాయమైనా ఒండ్రు మట్టిని ఉపయో గించవచ్చును.

ఇక, మృత్తికా స్నానం గురించి చెప్తాను, కానీ... ఈ రోజుల్లో అది ఆచరించటం, ముఖ్యంగా పట్టణాల్లో వున్న వారికి సాధ్యమయ్యేది కాదర్రా... ఏ ప్రకృతి చికిత్సలయా ల్లోనో తప్ప, గ్రామసీమల్లోనూ ఎవరూ ఆచరించడం లేదు. అయినా యిదేమీ బ్రహ్మ విద్యకాదుగానీ, అ వసతులు యిప్పుడు మృగ్యం.

ప్రాతః కాలాన్నే మేల్కొని, నిత్య కృత్యాలని తీర్చుకుని, ఓ అరగంట వ్యాయమం చేసి, ఆ తర్వాత ఓ పావుగంట విశ్రాంతి తీసుకుని, నదీ తీరానికి వెళ్ళి, నదీ తీరం అడుగు భాగంలో వుండే ఒండ్రు మట్టిని నఖశిఖ పర్యంతం వంటి మీద చిక్కగా పట్టించుకుని, నిశ్చ లంగా నదీ తీరంలో ఓ పావుగంట కూర్చోవాలి.

ఇలా చేయడం వల్ల దేహంలోని విషాన్ని అస్వాభావి కమైన ఉష్ణాన్ని మృత్తిక ఆకర్షించి, మనిషి ప్రాణానికి హాయిని గొలుపుతుంది. పావుగంట అవగానే శరీరానికి చలి కలుగుతుంది. అప్పుడు ఆలస్యం చెయ్యకుండా నదీ జలంలో స్నానం చెయ్యాలి. ఈ మృత్తిక స్నానం వల్ల మెదడుకు, కళ్ళకు, జఠరమునకు మంచి మేలు జరుగు తుంది. ముఖ్యంగా ఉడుకు రోగం గలవారికి ఈ మృత్తికా స్నానం రామబాణం వంటిది.

అయితే ఒకటర్రా... నిజంగా ఈ మృత్తికా స్నానం ఆచరించదలచుకున్నవారు ఒక బండో, రెండు బండ్లో ఒండ్రు మట్టిని తెప్పించుకుని, యింట్లో పెరటి వైపు శుభ్రంగా ఉండే స్థలంలో వుంచాలి. తాటాకులతో పెరట్లో ఓ మరుగుని ఏర్పరచుకుని ఈ మృత్తికా స్నానం చెయ్యవచ్చును. ఒకసారి ఉపయోగించిన ఒండ్రుమ ట్టిని మళ్ళీ ఉపయోగించకూడదు. అయితే పట్టణాల్లో పెరళ్ళూ వుండవు; తగిన ఖాళీ స్థలం వుండదు కాబట్టి, వారు యిలాంటి చికిత్సలు ఈరోజుల్లో చేసుకోడం కష్టమే. కానీ ఏమాత్రం వీలున్నా యిలాంటి ప్రకృతి చికిత్సలే మంచివి. ఏమంటారర్రా...